ఈ స్టేషన్‌కు ఆయనే 'హెడ్'

- నిత్యం బందోబస్త్ పేరిట బయట ఉంటున్న ఎస్‌ఐ
- పేరుకుపోతున్న కేసులు.. తలెత్తుతున్న శాంతిభద్రతల సమస్య
- 25 మంది సిబ్బందిలో ఆరుగురే విధుల్లో...
- వెలవెల బోతున్న పోలీస్‌స్టేషన్



శెట్టూరు: కర్ణాటకకు కూతవేటు దూరంలో ఉన్న శెట్టూరు స్టేషన్‌కు హెడ్‌కానిస్టేబుల్ 'పెద్ద' దిక్కు అయ్యాడు. మండలంలో శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన పోలీస్ బాస్ (ఎస్‌ఐ) స్థానికంగా ఉండకపోవడంతోపాటు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో అన్నీ ఆయనే చూసుకోవాల్సి వస్తోంది. సరిహద్దులో తనిఖీలు లేకపోవడంతో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం ఇవతలికి దాటిస్తున్నారు. పేకాట స్థావరాలు, అసాంఘిక కార్యకలాపాలూ అధికమే. దీనికితోడు సిబ్బంది కొరత ఉండడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. కేసులు పేరుకుపోతుండడం.. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుండడంతో ఎస్‌ఐ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శెట్టూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐతోపాటు మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. అయితే వాస్తవానికి ఇక్కడ పని చేస్తున్నది కేవలం ఆరుగురే. స్టేషన్‌పరిధిలో ముగ్గురు ఏఎస్‌ఐలు ఉండాల్సి ఉంది. ఇక్కడ విధుల్లో ఒక్కరూ లేరు. హెడ్ కానిస్టేబుళ్లు ఆరుగురు ఉండాల్సి ఉండగా, విధుల్లో ఒక్కరే ఉన్నారు. 16 మంది కానిస్టేళ్లకు గాను విధుల్లో ఐదుగురు మాత్రమే ఉన్నారు. అందులో కోర్టు పనిపైన, ఇతరాత్ర పనులపై బయట ఉంటున్నారు. ఇలా స్టేషన్ మొత్తం కేవలం ఆరుగురు సిబ్బందితో నడుస్తోంది.

అసలే కర్ణాటక సరిహద్దు...

శెట్టూరు మండలం అంటే కర్ణాటక రాష్ట్రానికి కూతవేట దూరంలో ఉంటుంది. అత్యధికంగా కర్ణాటక మద్యం అక్రమంగా ఇవతలికి వస్తుంటుంది. సరిహద్దులో పేకాట స్థావరాలు ఎక్కువే. ఇటు ఆంధ్ర..అటు కర్ణాటక ఉండడంతో సరిహద్దులో పేకాట స్థావరాలకు పెట్టింది పేరులా ఉంటుంది. దీనికితోడు స్టేషన్‌లో సిబ్బంది కొరత, తనిఖీలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

నిత్యం బందోబస్త్‌లో ఎస్‌ఐ...

ఎనిమిది నెలలుగా ఎస్‌ఐ శెట్టూరు స్టేషన్‌లో కన్న బయట బందోబస్త్ విధుల్లోనే అత్యధిక కాలం ఉంటున్నారు. నెలలో వారం , 15 రోజులు బందోబస్త్ కార్యక్రమాల్లోనే ఎస్‌ఐ ఉంటున్నారు. ఇలాంటి సమయాల్లో ఎస్‌ఐ స్టేషన్‌కు వచ్చే వరకు కేసులు పేరుకుపోతున్నాయి. తీరా ఎస్‌ఐ స్టేషన్ విధుల్లోకి వచ్చే సరికి స్టేషన్ మొత్తం కిటకిటలాడుతుంది. అప్పటివరకు స్టేషన్ వెల వెలబోతుంది.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

శెట్టూరు పోలీస్ స్టేషన్‌కు సిబ్బంది కొరత ఉంది. అయినప్పటికీ ఉన్నవారు కూడా డెప్యుటేషన్, ఇతర కారణాలతో బయటికి వెళ్తున్నారు. అయినా ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్‌లో ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బందిని నియమించి, మండలంలో శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అంతా తానై చూస్తున్న హెడ్‌కానిస్టేబుల్



వారం రోజులుగా ఎస్‌ఐ బందోబస్త్ కోసమని శ్రీశైలం వెళ్లారు. అప్పటి నుంచి స్టేషన్ వ్యవహారాలు మొత్తం ఒక్కరే చేసుకోవాల్సి వస్తోంది. ఒక హెడ్‌కానిస్టేబుల్ అంతా తానై చూస్తున్నాడు. ముగ్గురు ఏఎస్‌ఐల పని, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్ల విధులు ఒక్కరే చూస్తున్నారంటే ఎంత బరువు బాధ్యతలుంటాయో అర్థం చేసుకోవచ్చు. స్టేషన్ పర్యవేక్షణ, ఎఫ్‌ఐఆర్‌ల నమోదు, కోర్టుకు వెళ్లడం, గ్రామాల శాంతిభద్రతల పర్యవేక్షణ ఇలా.. అన్ని పనులూ ఒక్కరే చూసుకుంటున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులును పరామర్శిస్తున్న రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: కుందుర్పి మండలంలోని రుద్రంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసులు ఇటీవల పాముకాటుకు గురై అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసులును పరామర్శించారు. మెరుగైన చికిత్స అందిచాలని వైద్యులకు సూచించారు. ఎనుములదొడ్డి సర్పంచ్ విజయ్, నాయకులు ఈశ్వరయ్య, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కోదండ రామిరెడ్డి

కూడేరు: కూటమి ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతులు చేపట్టాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. 12వ పీఆర్‌సీపై ప్రభుత్వం తక్షణమే జ్యుడీషియల్ పే కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ఆలస్యమైనందున ఐఆర్ మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిన ట్రాఫిక్ ఉల్లంఘన కొత్త జరిమానాలను ప్రభుత్వ ఉద్యోగులకు మినాయింపు ఇవ్వాలని కోరారు. యూనియన్ తరపున నిలిచి, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని ఆయన తెలియజేశారు.

విజృంభిస్తున్న అతిసారా



కూడేరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న అతిసారా బాధితులు

కూడేరు: గ్రామాల్లో అతిసారా విజృంభిస్తోంది. మంగళవారం కలగళ్ల, చోళసముద్రం, కరుట్లపల్లి, ఉదిరిపికొండతో పాటు ఆత్మకూరు మండలం సింగంపల్లి, తలుపూరు గ్రామాలకు చెందిన ప్రజలు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వైద్యం కోసం సుమారు 20 మంది దాకా కూడేరు పీహెచ్‌సీకి వచ్చారు. డాక్టర్ సామ్యారెడ్డి వారిని పరీక్షించి, అవసరమైన వారికి సెలైన్ ఎక్కించారు. ఆహారం తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, కలుషిత నీటిని, ఆహార పదార్థాలను తీసుకోవద్దని డాక్టర్ సూచించారు. ఎండలు మండుతున్నాయని, నీరు ఎక్కువగా తాగాలని తెలియజేశారు. నాలుగైదు రోజులుగా రోజుకు ఐదారుగురు అతిసార బారినపడి వైద్యం కోసం పీహెచ్‌సీకి వస్తున్నారు.

ఇందిరమ్మ కాలనీలో నీటి ఎద్దడి



సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పది రోజులుగా తాగునీరు లేక కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. మంగళవారం తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీలోని మహిళలు పెద్ద ఎత్తున సచివాలయం ఎదుట నిరసన తెలియజేశారు. మహిళలు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో తాగునీరు, విద్యుత్ సక్రమంగా సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఉరవకొండ: ఉరవకొండ ఎక్సైజ్, సివిల్ పోలీసులు వేర్వేరుగా పట్టుకున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ రేవతి మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో 24 కేసుల్లో పట్టుబడిన 1105 టెట్రా ప్యాకెట్లు, సివిల్ పోలీసులు 13 కేసుల్లో పట్టుబడిన 325 క్వాటర్ బాటిళ్ల మద్యం, 52 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

లిటిల్ ఏంజిల్స్ స్కూల్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి



ఎస్‌ఐ నాగమధుకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కణేకల్లు: పిల్లలను అకారణంగా చావబాదిన లిటిల్ ఏంజిల్స్ స్కూల్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు వినతిపత్రం అందించారు. లంచ్ టైమ్‌లో పర్మిషన్ తీసుకొని బయటికెళ్లిన విద్యార్థులను హెచ్‌ఎం చితకబాదిన విషయం విదితమే. విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు కోరారు. అనంతరం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆందోళనకారులతో చర్చించారు. విద్యార్థులను అకారణంగా ఇబ్బంది పెట్టొద్దని హెచ్‌ఎంలకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ హెచ్‌ఎంలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. చిన్నారులతో ప్రేమగా మసలుకోవాలని, కర్రలు, ప్లాస్టిక్, స్టీల్ పైప్‌లతో కొట్టడం సరికాదన్నారు. సమావేశంలో ఎస్‌ఐ నాగమధు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి తదితరులు

వజ్రకరూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని వజ్రకరూరు, కమలపాడు, ఛాయాపురం, గడేహోతూరు, చిన్న హోతూరు, పొట్టిపాడు, తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి, కరపత్రాలు పంపిణీ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు 2024–25 ఖరీఫ్, రబీ సీజన్‌లో ఊపంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించి, రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధాకర్, రంగయ్య, సర్వన్న, ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి గొర్రెల మృతి



రోదిస్తున్న గొర్రెల కాపరులు

బ్రహ్మసముద్రం : కలుషిత నీరు తాగి 24 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీ ముద్దలాపురం గ్రామానికి చెందిన ఎరికల రామన్న... గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే మంగళవారం జీవాలను మేపునకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని తోటలో మొక్కజొన్న పంటకు డ్రిప్ ద్వారా వదిలేందుకు యూరియా కలిపిన నీటిని గొర్రెలు తాగాయి. కాసేపటి తర్వాత ఒకదాని వెనుక ఒకటి చొప్పున మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కలుషిత నీరు తాగడం వల్లనే గొర్రెలు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, నాయకుడు మల్లేష్ తదితరులు బాధితుడిని పరామర్శించి, జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా నష్టపోయిన గొర్రెల కాపరిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వజ్రకరూరు పీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న నోడల్ జిల్లా అధికారి గంగాధర్‌రెడ్డి

వజ్రకరూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా సికిల్‌సెల్ నోడల్ అధికారి గంగాధర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆశాడే సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సర్దార్‌వలి, తేజశ్వి, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, సూపర్ వైజర్లు నాగశంకర్, సుశీల, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి కాలనీలో చెలరేగిన మంటలు



చౌడేశ్వరికాలనీలో అర్ధరాత్రి ఎగసిపడుతున్న మంటలు

ఉరవకొండ: స్థానిక చౌడేశ్వరి కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఓ ఖాళీ ప్రదేశంలో భారీగా మంటలు చెలరేగడంతో చుట్టు పక్కలవారు ఉలిక్కిపడ్డారు. ఆకతాయిలు ఖాళీ ప్రదేశంలో ఎండిన చెట్లు, మొద్దులు, చెత్తాచెదారంపై అగ్గి పెట్టడంతోనే మంటలు చెలరేగి ఉంటాయని స్థానికులు తెలిపారు. ఇళ్ల మధ్య ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో మంటలు పక్కనే ఉన్న ఇళ్లకు ఎగసిపడకుండా అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కళ్యాణదుర్గం రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ వీబీ చిత్ర సూచించారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత ఆవశ్యకతను వివరించారు. దేశంలో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించిన మహిళల గురించి తెలియజేశారు. కార్యకరమంలో ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి, మహిళా సాధికార విభాగ సమన్వయకర్త రుక్మిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరసముద్రంలోని ప్రభుత్వ చౌక దుకాణం నం.16 ను తహసీల్దార్ సుమతి మంగళవారం తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్‌ను పరిశీలించి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకులను ప్రజలకు ఇబ్బంది కలగకుండా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ అన్సర్ బాషా, ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదోడి ప్రాణానికి ఖరీదు!

- గత నెల 28న వైద్యం వికటించి మృతి చెందిన తాపీమేస్త్రీ విజయ్
- ఆర్‌ఎంపీ టీడీపీ నాయకుడు కావడంతో రూ.3లక్షలకు రాజీ కుదిర్చిన అధికార పార్టీ నేతలు!
- మృతి చెందిన రోజే కేసు లేకుండా రాజీ
- ఐదు రోజుల తర్వాత డీఎంహెచ్‌ఓ విచారణ
- అసలు ఆర్‌ఎంపీ చికిత్స చేయలేదని కుటుంబ సభ్యులతో అంగీకారం



రాయదుర్గం పట్టణంలో మృతుడి కుటుంబ సభ్యులను విచారిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

రాయదుర్గంటౌన్ : కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండే యువకుడి ప్రాణానికి వెలకట్టినట్లు పట్టణంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. గత నెల 28వ తేదీ ఆర్‌ఎంపీ చెన్న వీర చేసిన వైద్యం వికటించి రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన తాపీమేస్త్రీ ఎస్.విజయ్ (30) మృతి చెందాడు. రకరకాల మందులు ఇవ్వడం వల్లనే ఆర్‌ఎంపీ చేసిన వైద్యంతోనే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయాడని తల్లి లక్ష్మీదేవితోపాటు అతని కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రిలో బోరున విలపించారు. టీవీ చానళ్లు, పత్రికలు, సోషల్ మీడియాలో కూడా వచ్చాయి. ఇక్కడ ఆర్‌ఎంపీ వైద్యుడు చెన్నవీర 29వ వార్డుకు చెందిన ముఖ్యమైన టీడీపీ నాయకుడు కావడంతో రంగంలోకి టీడీపీ ముఖ్య నేతలు దిగారు. అదే రోజు రాత్రి కేసు లేకుండా ప్రాణానికి వెలకట్టి రూ.3 లక్షలు బాధిత కుటుంబానికి అందజేసేలా సెటిల్ చేశారని, వైద్య అధికారులు విచారణకు వస్తే ఓ కట్టుకథ అల్లి బాధిత కుటుంబ సభ్యులతో డీల్ కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అసలు ఆర్‌ఎంపీ వైద్యమే చేయలేదట!

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందిన విజయ్ కేసులో దాదాపు ఐదు రోజుల తర్వాత అధికారులు స్పందించడంపై అనుమానాలకు తావిస్తోంది. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని సచివాలయంలో విజయ్ కుటుంబ సభ్యులతో మంగళవారం డీఎంహెచ్‌ఓ ఈబీదేవి విచారణ చేపట్టారు. విచారణకు మృతుడి తల్లి లక్ష్మీదేవి, భార్య శిరీష హాజరయ్యారు. మృతుడి భార్య శిరీష మాట్లాడుతూ బెంగళూరులో తాపీ మేస్త్రీగా పనిచేసే తన భర్త.. తండ్రి మృతిచెందడంతో రాయదుర్గానికి వచ్చినట్లు చెప్పింది. తండ్రి మృతితో మనస్థాపం చెంది నాలుగు రోజుల నుంచి మద్యం సేవిస్తున్నట్లు తెలిపింది. కడుపు నొప్పితో బాధపడుతున్న తన భర్తను ఆర్‌ఎంపీ చెన్నవీరా వద్దకు గురువారం తీసుకెళ్లగా, మద్యం తాగి ఉన్నాడని వైద్యం చేయడానికి ఆర్‌ఎంపీ నిరాకరించినట్లు తెలిపింది. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచిస్తే.. తాము అదేరోజు వెళ్లలేదని మరుసటి రోజున వెళ్లగా అప్పటికే తన భర్త మృతి చెంది ఉన్నట్లు అధికారులకు వివరించింది. బాధిత కుటుంబ సభ్యులతో వివరణ తీసుకున్న డీఎంహెచ్‌ఓ అక్కడి నుంచి బయల్దేరి వెళ్లిపోయారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సదరు ఆర్‌ఎంపీ వద్దకు కూడా విచారణకు వెళ్లగా అతను అందుబాటులో లేరన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌కే తాము ప్రాధాన్యత ఇస్తామని పేర్కొనడం కొసమెరుపు.

కబ్జా చేయలేదు..



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న దర్గా నిర్వాహకులు

రాయదుర్గంటౌన్: పట్టణానికి ఆనుకొని కొండపై వెలసిన సయ్యద్ జాఫర్‌షావలి దర్గా పరిసరాలను కబ్జా చేయలేదని, పర్యవేక్షిస్తున్నామని దర్గా నిర్వాహకులు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకాలాపాలు జరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కుంట పరిసరాల అభివృద్ధికి సహకరించాలని, దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని కాలనీకి చెందిన బ్రెడ్ సర్మాస్, ఖాజీ సైఫుల్లా, నిజాముద్దీన్ తెలిపారు.

తల్లిదండ్రుల కల నెరవేరిన వేళ..



తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, మురళీయాదవ్‌తో ఊర్జితా యాదవ్

కూడేరు: మరుట్ల -1 కాలనీలో పేదింటి విద్యాకుసుమం డాక్టరయ్యింది. వ్యవసాయాన్ని నమ్ముకున్న తల్లిదండ్రులు కూతురును కష్టపడి చదివించారు. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేసి తల్లిదండ్రుల ఆశను నెరవేర్చింది. మండలంలోని మరుట్ల–1వ కాలనీకి చెందిన రైతు మురళీ యాదవ్, ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె ఊర్జితా యాదవ్ బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ కోర్సుల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఈమె కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో 2019లో కోర్సులో చేరింది. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఊర్జితా యాదవ్ ఎంబీబీఎస్ పట్టా అందుకుంది. దీంతో తల్లిదండ్రులు స్వీట్స్ తినిపించి, సంతోషాన్ని పంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు ఊర్జితా యాదవ్ తెలిపింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



దోమల నియంత్రణ కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలను సిబ్బందికి అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని కొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనికేత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. మంగళవారం కొకుంట్ల పీహెచ్‌సీలో జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, ఇంట్లో నిల్వ చేసిన నీరు శుభ్రం చేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించేలా కరపత్రాలు, పోస్టర్లు అందించారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ అపహరణ

రాయదుర్గంటౌన్: వ్యవసాయ విద్యుత్ మోటారు కేబుల్ అపహరణతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణ శివారు శ్రీమద్దాన్నేశ్వరస్వామి ఆలయ సమీపంలోని పొలాల్లో దాదాపు ఏడు వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ మోటార్ల వైర్లను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధిత రైతులు వన్నూరుస్వామి, జలంధర్, రాజు, వెంకటప్ప, రామ్మూర్తి తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు చెందిన దాదాపు 30 నుంచి 40 మీటర్ల కేబుల్ ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలోని గోవిందరెడ్డి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోవిందరెడ్డి పొలంలోకి ప్రవేశించి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు లభ్యం కావడంతో ఎస్‌ఐ ఈశ్వరయ్య ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

బాల్య వివాహంతో అనర్థాలు



బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: బాల్య వివాహాలతో అనర్థాలే అధికమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమారరాజా, గీతాభార్గవి అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్టలో బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యంలో వివాహాలు వల్ల ఎక్కువగా మాతృ, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి పాల్గొన్నారు.

రథం తయారీకి విరాళం

కూడేరు: ప్రసిద్ధిగాంచిన జోడు లింగాల సంగమేశ్వర స్వామి నూతన రథం తయారీకి సుధాకర్ అనే వ్యక్తి రూ.25,116, సింగంపల్లి నారాయణ స్వామి రూ.5 వేలు, శంకరయ్య రూ.5 వేలు అందించారు. ఈ మొత్తాన్ని మంగళవారం నిర్వాహకుడు కుశాల నాగరాజుకు అందించారు.

హావళిగిలో 'పొలం పిలుస్తోంది'



హావళిగిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

విడపనకల్లు: మండలంలోని హావళిగిలో వ్యవసాయాధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌కేలో రైతులతో కలిసి వ్యవసాయాధికారులు ఖరీఫ్‌లో సీడ్స్ కంపెనీ యాజమానులు రైతులకు విత్తనాలు ఇచ్చిన తర్వాత పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా, కంపెనీ యాజమాన్యం కొనుగోలు చేయాలని తెలియజేశారు. దళాలరులను నమ్మొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.